సాక్షి సూర్యాపేట

ఆదివారం । 28 । జనవరి । 2024



సైదన్నా.. వెళ్లొస్తాం

పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ముగిసింది. చివరి రోజైన శనివారం దీపారాధనలు చేశారు. - 8లో



భక్తుల కోలాహలం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి శనివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో కోలాహలం నెలకొంది. - 8లో



విద్యార్థులకు అస్వస్థత

కలుషిత ఆహారం తిని నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన అనంతగిరిలో చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

30న జాబ్ మేళా

సూర్యాపేటటౌన్: కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ జానపాటి కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్ బీ ప్రోగ్రాం కోసం 2023లో ఎంపీసీ, ఎంఈసీలో ఇంటర్ పూర్తి చేసిన, 2024లో పూర్తి చేయబోతున్న విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపీసీ, ఎంఈసీలో 75శాతం ఓవర్‌లుగా, 60శాతం మార్కులు మ్యాథ్స్‌లో పొందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే విద్యార్థులకు పదో తరగతి పాస్ సర్టిఫికెట్, ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు ఒక ఫొటో, మొబైల్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధి రమేష్ 8341405102 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

29న దివ్యాంగులకు..

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ స్టేట్ యూత్ ఫర్ జాబ్స్ సహకారంతో జిల్లాలోని దివ్యాంగులకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేటలోని సమీకృత కలెక్టరేట్‌లో గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ మేళాకు టెన్త్ నుంచి పీజీ వరకు చదివిన 18 నుంచి 32 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీయువకులు విద్యార్హత, ఆధార్, దివ్యాంగ ధ్రువీకరణ సర్టిఫికెట్, 2 పాస్ ఫొటోలతో సూర్యాపేట డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌లో హాజరుకావాలని సూచించారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్, వరంగల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 86889 01631 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సీఐ, ఎస్‌ఐల బదిలీ

సూర్యాపేట క్రైం: జిల్లాలో పనిచేస్తున్న సీఐ, ఎస్‌ఐలను బదిలీ చేస్తూ హైదరాబాద్ రేంజ్ ఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట ఎస్‌బీ సీఐగా పనిచేస్తున్న టి.నాగార్జునగౌడ్‌ను మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల రూరల్ సీఐగా, వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ జి.సతీష్‌ను నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐగా బదిలీ చేశారు.

విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్ష



ప్రశ్నపత్రం విడుదల చేస్తున్న డీఈఓ అశోక్

సూర్యాపేటటౌన్ : తెలంగాణ గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ హాజరై ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభా పరీక్ష ద్వారా గణితంపై పట్టు సాధించవచ్చన్నారు. ఇలాంటి పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులకు గణితం నేర్చుకోవడానికి సులభంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా టీఎంఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.అశోక్, ప్రధాన కార్యదర్శిగా డి.కోటేశ్వర్‌రావు, కోశాధికారిగా ఎం.శ్యామ్, ఉపాధ్యక్షులుగా శైలజ, కల్‌రామ్, పురుషోత్తం, సలహాదారులుగా జితేందర్‌రెడ్డి, మోతిలాల్ నాయక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి కళారాణి, హెచ్‌ఎం గోలి పద్మ, టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు ప్రత్యేకంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఏల్గూరి గోవిందు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బగాని భిక్షం, జిల్లా సహాయ కార్యదర్శి ఉయ్యాల నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు గుణగంటి కృష్ణ, జెరిపోతుల కృష్ణ, నాగమల్లయ్య పాల్గొన్నారు.

ఢిల్లీ వేడుకల్లో జిల్లా డప్పు కళా బృందాలు

గరిడేపల్లి, నేరేడుచర్ల: ఢిల్లీలోని పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ డప్పు కళాకారుల బృందం, మహిళా కళాకారులు, నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన డప్పు కళాకారిణి నన్నెపంగ రమణ బృందం పాల్గొంది. తెలంగాణ ప్రభుత్వం తరుపున తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ ఇన్‌చార్జ్ డాక్టర్ మామిడి హరికృష్ణ సహకారంతో అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్ సౌజన్యంతో చాకలి ఐలమ్మ, రాంజీ గోండు, కొమరంభీమ్ శకటం వెంట కళాబృందంతో కలిసి డప్పు కొట్టే అవకాశం వచ్చినట్లు వారు పేర్కొన్నారు.





ఢిల్లీలోని పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ప్రదర్శన ఇస్తున్న నేరేడుచర్ల మండల కళాకారుల బృందం, గరిడేపల్లి మండలానికి చెందిన దప్పు కళాకారుల బృందం

నిజాలు నిగ్గుతేలేనా!

రూ.40లక్షల దుర్వినియోగంపై విచారణ ప్రారంభం

- దీనిపై నేటికీ తేలని లెక్క
- కావాలనే విచారణలో జాప్యం చేస్తున్నారని ఆరోపణలు
- అధికారి బదిలీపై వెళ్తే చర్యలు ఎవరిపై తీసుకుంటారని ప్రశ్నిస్తున్న సభ్యులు



కోదాడ మండల పరిషత్ కార్యాలయం

ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం



కోదాడ మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై ముగ్గురు అధికారులతో కలిసి విచారణ చేశాం. విచారణలో తెలిసిన విషయాలపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశాం.

– సూర్యానారాయణ, ఆర్డీఓ, కోదాడ

కోదాడరూరల్ : కోదాడ మండల పరిషత్‌లో నిధుల దుర్వినియోగంపై విచారణలో వాస్తవాలు నిగ్గుతేలుతాయా.. లేక ఆ విచారణ అటకెక్కుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ ప్రారంభించి నెలరోజులు గడిచినా ఇప్పటి వరకు ఏం తేల్చారో అధికారులు వివరాలు బహిర్గతం చేయలేదు. కావాలనే వివరాలు బయటకు చెప్పడం లేదా.. అధికారులపై ఏదైనా ఒత్తిడి ఉందా అన్న అనుమానాలూ కలుగుతున్నాయి. కోదాడ మండల పరిషత్‌లో రూ.40లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు పాలకమండలి సభ్యులు గత నెల 19న కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. అదే నెల 21న విచారణకు ఆదేశించారు. దీంతో జెడ్పీ సీఈఓతో పాటు, జిల్లా ఆడిటర్, కోదాడ ఆర్డీఓలు కలిసి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించారు. ఆ సమయంలో పలువురు పాలక మండలి సభ్యులు నిధుల దుర్వినియోగంపై పలు విషయాలను వారి దృష్టికి తీసుకెళ్లగా వాటిపై కూడా విచారణ చేస్తామని చెప్పారు.

భారీగా నిధుల దుర్వినియోగం?

రూ.40లక్షలు దుర్వినియోగం అయ్యాయని పాలక మండలి సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ ఆ తర్వాత ఆ లెక్క మరింత ఎక్కువగా ఉందని తెలిసింది. మండల పరిషత్‌లో పనిచేస్తున్న ఉన్నతాధికారితోపాటు, అప్పటి ప్రజాప్రతినిధి కలిసి పాలక మండలి తీర్మానం లేకుండా పలు పనులకు సంబంధించి బిల్లులు కాజేసినట్లు తెలిసింది. ఇంటర్‌నెట్, చాయ్, బిస్కెట్స్, మరమ్మతుల పనుల పేరిట ప్రతినెలా రూ.30 వేల నుంచి రూ.40వేల బిల్లుల వరకు ఆ ఉన్నతాధికారి భర్త పేరున డ్రా చేసినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఇలా మూడేళ్లపాటు నిధులు కాజేసినట్లు తెలిసింది. ఇవే కాకుండా పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పాలక మండలి తీర్మానం లేకుండానే నూతనంగా మూడు షాపులు నిర్మించడం, వాటికి మండల పరిషత్ నుంచి రూ.3లక్షల నిధులు కేటాయించడంతో పాటు ఆ షాపులు అద్దెకు ఇచ్చిన వారి నుంచి రూ.లక్ష చొప్పున అడ్వాన్స్ తీసుకున్నట్లు విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఇక ఆ షాపుల నుంచి ప్రతి నెలా రూ.8వేల చొప్పున అద్దెలు కూడా వసూలు చేస్తున్నప్పటికీ ఆ నిధులను మండల పరిషత్ నిధుల్లో జమ చేయలేదని సమాచారం. ఈ వ్యవహారంలో రెండు రోజుల అప్పటి మండల పరిషత్ ప్రజాప్రతినిధికి షోకాజ్ నోటీసులు వచ్చినట్లు తెలిసింది. అయితే అధికారులు చివరకు సుమారు రూ.19లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలుస్తోంది. అయితే ఆ అధికారి ఇక్కడి నుంచి బదిలీ అయితే దుర్వినియోగమైన నిధుల పరిస్థితి ఏంటని పాలకమండలి సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

విచారణను నీరుగార్చుతున్నారా..

పక్క నియోజకవర్గంలోని ఓ మండల సీనియర్ కార్యదర్శిని, మరో మండల కార్యదర్శిపై ఇదే విధంగా ఫిర్యాదు చేయగా విచారణ చేసిన అధికారులు వాస్తవాలు తేలడంతో వారిని వెంటనే విధుల్లో నుంచి సస్పెండ్ చేశారు. అయితే కోదాడ మండల పరిషత్‌లో ఇంత పెద్దఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయని ఫిర్యాదు అంది, విచారణలో నిజాలు తెలిసినా నేటి వరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అంతుచిక్కని ప్రశ్నగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఆ అధికారికి ఉమ్మడి జిల్లాలోని ఓ ఎమ్మెల్యేతో పాటు మండలంలోని ఇద్దరి అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది.


వైద్యారోగ్య శాఖలో ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

- సూర్యాపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ, డీడీఓ, ల్యాబ్ టెక్నీషియన్‌పై వేటు
- ఉత్తర్వులు జారీ చేసిన హెల్త్ డైరెక్టర్

సూర్యాపేట : ముగ్గురు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణలో లాలూచీ పడ్డారన్న అభియోగం మేరకు సూర్యాపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ హర్షవర్ధన్, డీడీఓ రోహిణి, ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణపై సస్పెన్షన్ వేటు వేస్తూ శనివారం వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పెన్‌పహాడ్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ 2022 సెప్టెంబర్‌లో ప్రమాదానికి గురై సుమారు 10 నెలలకు పైగా విధులకు హాజరు కాలేదు. అప్పట్లో సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓగా కొనసాగుతున్న హర్షవర్ధన్ డీడీఓగా కొనసాగుతున్నారు. సెలవు పెట్టేందుకు సత్యనారాయణ రాగా విధులకు రాకుండా వేతనం ఇచ్చేందుకు డిప్యూటీ డీఎంహెచ్ఓ ఒప్పందం చేసుకున్నాడు. పెన్‌పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 2023 సెప్టెంబర్ నుంచి సత్యనారాయణకు హాజరు రిజిస్టర్లు ఆబ్సెంట్ వేస్తుండగా జీతం మాత్రం డ్రా చేసినట్లు రుజువైంది. 2023 జనవరిలో అక్కడికి రెగ్యులర్ వైద్యాధికారి వచ్చినప్పటికీ చార్జ్ ఇవ్వకుండా డిప్యూటీ డీఎంహెచ్ఓ 2023 జూలై వరకు బిల్లులు చేశారు. ఈ విషయమై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సాహితీలు విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. విచారణ మేరకు డిప్యూటీ డీఎంహెచ్ఓ హర్షవర్ధన్, డీడీఓ కేఎస్ఆర్ రోహిణి, కె.సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ హెల్త్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని వైద్యాధికారులు తెలిపారు.

సైబర్ వల.. చిక్కితే విలవిల

- రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు
- మాయమాటలతో నమ్మించి బ్యాంక్ ఖాతాలు ఖాళీ చేస్తున్న కేటుగాళ్లు



సూర్యాపేట క్రైం: రోజురోజుకు ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. మాయమాటలతో నమ్మించి బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. విద్యావంతులు, ఉద్యోగులు సైతం వీరి వలలో పడి మోసపోతున్నారు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేస్తున్నారు. ఆ దరఖాస్తుల్లో తప్పులున్నాయని సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఫోన్ చేసి, ఓటీపీ అడుగుతుండడం గమనార్హం. ఇలా మోసపోయిన వారి డబ్బు ఎటుపోతుందో కూడా పోలీసులు కనిపెట్టలేకపోతున్నారు. జిల్లాలో సైబర్ నేరాల ఫిర్యాదుల్లో 20 శాతం కూడా రికవరీ కాలేదని విమర్శలు ఉన్నాయి. వెంటనే ఫిర్యాదు చేసిన సందర్భాల్లో మాత్రం డబ్బులు కోల్పోకుండా ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. కాగా.. జిల్లాలో 2021లో 52 సైబర్ కేసులు నమోదయ్యాయి. 2022లో 126 కేసులు, 2023లో 212 కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.

ఓటీపీ చెప్పొద్దు

ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు అకౌంట్ సంబంధిత ఓటీపీ వివరాలు అడిగితే చెప్పొద్దు. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ఆరు గ్యారంటీల కోసం ఎవరూ ఓటీపీ అడగరు. ప్రజలు సైబర్ కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– రాహుల్ హెగ్డే, సూర్యాపేట ఎస్పీ

ఇటీవల జరిగిన సంఘటనలు..

- పెన్‌పహాడ్ మండలం అనంతానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశా రు. ఆరు గ్యారంటీలు రావాలంటే ఓటీపీ చెప్పాలని నమ్మబలికారు. అతను ఓటీపీ చెప్పగానే అకౌంట్ నుంచి రూ.10వేలు కట్ అయ్యాయి.
- సూర్యాపేట పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆన్‌లైన్‌లో షాపింగ్ చేశాడు. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి ఆర్డర్ రావాలంటే ఓటీపీ చెప్పాలన్నారు. దీంతో ఆయన చెప్పగానే బ్యాంక్ అకౌంట్‌లో నుంచి డబ్బులు మాయమయ్యాయి.



యువ సాయం

ఉన్నత చదువులు పక్కనపెట్టి, ఉన్నత ఉద్యోగాన్ని వదిలి పొలంబాట పట్టారు. ఆధునిక పద్ధతులతో సేద్యం చేస్తూ లాభాలు గడిస్తున్నారు. పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. భూక్య బిచ్చునాయక్, రమావత్ బాలకృష్ణ. - ప్రత్యేక కథనం 8లో

రికార్డులు స్వాధీనం



రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న డీఎల్‌పీఓ

మఠంపల్లి: మండలంలోని బిల్యానాయక్ తండా పంచాయతీ రికార్డులను డీఎల్‌పీఓ శ్రీరాములు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సర్పంచ్ బాణోతు శాంతి, ఉపసర్పంచ్ కృష్ణ గ్రామాభివృద్ధికి మంజూరైన నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ మూడు రోజుల క్రితం స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆదేశాల మేరకు విచారణకు వెళ్లగా పంచాయతీ వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నారనే సమాచారం తెలిసి మండల పరిషత్ కార్యాలయానికి రికార్డులను తెప్పించుకున్నట్లు పేర్కొన్నారు.

మానవ హక్కుల వేదికను బలోపేతం చేద్దాం

నేరేడుచర్ల: అమరుల స్ఫూర్తితో మానవ హక్కుల వేదికను బలోపేతం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్ అన్నారు. నేరేడుచర్ల మండల కేంద్రంలోని ముత్యాలమ్మగుడి వద్ద సర్వే నంబరు 234, 244లలో ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న నిరుపేదల సమక్షంలో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మానవ హక్కుల వేదిక 25 వసంతాల ప్రస్తావన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాక్రాంతం అవుతున్న భూములను రెవెన్యూ అధికారులు అర్హులైన పేదలకు అందించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు చింతమళ్ల గురువయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు నరేందర్, దశరథ, వాస పల్లయ్య, ప్రసాద్, సత్తమ్మ, మౌలాంబి, కరుణాకర్, రంగయ్య, మల్లేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో నెగ్గింది.. సూర్యాపేటలో వీగింది

- కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా చేతులెత్తిన 29మంది కౌన్సిలర్లు
- అనుకూలంగా నలుగురు మాత్రమే..
- పనిచేయని బీఆర్‌ఎస్ విప్
- సూర్యాపేటలో సభ్యులు హాజరు కాకపోవడంతో వీగిపోయిన అవిశ్వాసం







కోదాడ మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహిస్తున్న అధికారులు, సమావేశానికి హాజరైన చైర్‌పర్సన్, సభ్యులు

కోదాడ: కోదాడ, సూర్యాపేట మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరాల్లో ఆయా మున్సిపాలిటీల చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై శనివారం అవిశ్వాస తీర్మాన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌కు చెందిన కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గగా.. సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్‌చైర్మన్ కిషోర్‌కుమార్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. కోదాడ మున్సిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఆర్డీఓ సూర్యనారాయణ అధ్యక్షతన అవిశ్వాస సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లలో ఒకరు మరణించగా.. 16వ వార్డు కౌన్సిలర్ కల్లూరి పద్మజ హాజరు కాలేదు. మొత్తం 33 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. 29 మంది అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. వ్యతిరేకంగా చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్ చైర్మన్ వెంపటిపద్మ, కౌన్సిలర్లు బెజవాడ శిరీష, ఎస్‌కె.షఫీతో కలిసి కేవలం నలుగురే చేతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు రిటర్నింగ్ అధికారి, కోదాడ ఆర్డీఓ ప్రకటించారు. కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవడానికి తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో కోదాడ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్, మేనేజర్ రమేష్, నాయబ్ తహసీల్దార్ అనిల్ పాల్గొన్నారు. కాగా.. కోదాడ మున్సిపల్ కార్యాలయంలో డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

విప్ అమలు చేయాలి

సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్ వనపర్తి శిరీష తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు పార్టీ కౌన్సిలర్లకు జారీ చేసిన విప్‌ను అమలు చేయాలని కోరారు. దీనికి ఆర్డీఓ సూర్యనారాయణ సమాధానమిస్తూ అది పార్టీకి చెందిన వ్యవహారమని, తమ పరిధిలో అంశం కాదని తోసిపుచ్చి సమావేశం నిర్వహించారు.

బీఆర్‌ఎస్ విప్ జారీ చేసినా..

కోదాడ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ తరఫున 25 మంది కౌన్సిలర్లు గెలిచారు. వీరిలో ఒకరు మరణించారు. కాంగ్రెస్ నుంచి 8 మంది, సీపీఐ నుంచి ఒకరు, టీడీపీ నుంచి ఒకరు నెగ్గారు. అసెంబ్లీ ఎన్నికల ముందు 8మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, టీడీపీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానంలో బీఆర్‌ఎస్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా సొంత పార్టీలోని 11 మంది కౌన్సిలర్లు చేతులెత్తడం గమనార్హం. అంతకు ముందు ఉదయం కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్‌చైర్మన్ వెంపటి పద్మలు కోదాడ ఆర్డీఓను కలిసి తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లుకు జారీ చేసిన విప్‌లను అందజేశారు. అయినప్పటికీ కౌన్సిలర్లు వీటిని లెక్క చేయకుండా అవిశ్వాసంలో పాల్గొని పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా చేతులెత్తారు.

ధర్మమే గెలిచింది

- సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ అవిశ్వాస తీర్మానంలో ధర్మమే గెలిచిందని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ అన్నారు. శనివారం అవిశ్వాస తీర్మానం విగిపోయిన అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద వారు సంబురాలు నిర్వహించారు. అనంతరం రైతు బజారు వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిశోర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులుగౌడ్ పాల్గొన్నారు.

సూర్యాపేటలో సభ్యులు హాజరుకాకపోవడంతో..

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్‌చైర్మన్ కిశోర్‌కుమార్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ వెంకట్రావ్‌తో పాటు అదనపు రెవెన్యూ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి హాజరయ్యారు. మొదటగా ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణపై, ఉదయం 12 గంటలకు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఉండగా.. ఈ సమయంలో సమావేశానికి ఎవరూ హాజరుకాలేదు. దీంతో కలెక్టర్ తిరిగి 3 గంటలకు వాయిదావేశారు. కానీ ఈ సమయంలో అవిశ్వాసం పెట్టినా సభ్యులెవరూ హాజరుకాకపోవడతో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లుగా ప్రకటించారు.

చివరి వరకూ ప్రయత్నం

మున్సిపాలిటీలో మొత్తం 48 కౌన్సిలర్లు ఉండగా.. ఒకరు రాజీనామా చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ల పై 32 మంది అవిశ్వాస తీర్మానం పెట్టారు. క్యాంపులో ఉన్న 31 మందితో పాటు క్యాంపునకు దూరంగా ఉన్న 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని శుక్రవారం రాత్రి నుంచి అందుబాటులోకి రాకుండా పోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చివరి వరకు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. కాగా.. మున్సిపల్ కార్యాలయం వద్ద సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సాగర్‌లో అర్బన్ పార్కు ప్రారంభం





నెల్లికల్లు వద్ద ఏర్పాటు చేసిన వ్యూపాయింట్, పర్యాటకులకు ఏర్పాటు చేసిన వాహనం

- జలాశయతీరంలో రూ.1.5కోట్ల వ్యయంతో నిర్మాణం
- పర్యాటకులకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూపాయింట్ ఏర్పాటు
- అటవీ అందాల వీక్షణకు సఫారీ వాహనం కూడా..

నాగార్జునసాగర్: సాగర్ జలాశయతీరంలో రూ.1.5కోట్ల వ్యయంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వన్యప్రాణుల అటవీకోర్ ఏరియాలో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కును శనివారం అటవీశాఖ అధికారులు ప్రారంభించారు. నాగార్జునసాగర్–హైదరాబాద్, సాగర్–నల్లగొండ రహదారుల (సమ్మక్క–సారక్కల) వెంట 980 హెక్టార్ల విస్తీర్ణంలో పర్యాటకులను ఆకట్టుకునేలా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. 50మంది ఒకేచోట కూర్చొని తినడానికి గజాబాను నిర్మించారు. అటవీ ప్రాంతంలో పార్కు చుట్టూ 2కిలో మీటర్ల మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. గుట్టల్లోంచి పచ్చని వృక్షాల మధ్య గల సాగర్ జలాశయం వెనుక వైపున గల అందాలను తిలకించేందుకు నెల్లికల్లు అటవీ ప్రాంతంలో వ్యూపాయింట్‌ను ఏర్పాటు చేశారు.

ట్రిప్పుకు రూ.1,000లనుంచి రూ1,500లు

పర్యాటకులు అటవీ అందాలను వీక్షించేందుకు సఫారీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఒక ట్రిప్పులో 8నుంచి 10మంది వెళ్లనున్నారు. ఇందుకు 10కిలో మీటర్ల పరిధికి రూ.1,000 చార్జీ అవుతుండగా 24కిలో మీటర్ల పరిధిలో పర్యటించేందుకు రూ.1500లు చార్జీ వేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అడవిలో వివిధ రకాల జంతువులు కనిపిస్తున్నాయని పర్యాటకులు పేర్కొన్నారు. రూ.వెయ్యి, 1500 ఒక కుటుంబ సభ్యులు చెల్లించ గలిగితే వారికి ప్రత్యేకమైన ట్రిప్పులు వేస్తామని అధికారులు తెలిపారు. మొదటి రోజు నాలుగు ట్రిప్పులు నడపగా రూ.4వేల ఆదాయం వచ్చినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

64కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- సొత్తు విలువ రూ.32.30 లక్షలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద 64కిలోల గంజాయి పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన గంజాయిని కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌వోటీ, చౌటుప్పల్ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. గంజాయితోపాటు రవాణాకు వినియోగించిన కార్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చేపల విక్రయదారుడిగా ఉన్న కేరళ రాష్ట్రంలోని త్రిసూర్ జిల్లా తన్నియాం గ్రామానికి చెందిన పీహెచ్. ఫవాస్(29), భవన నిర్మాణ కార్మికుడైన అదే రాష్ట్రంలోని తిరువనంతపురం జిల్లా వెంగనూర్ గ్రామానికి చెందిన అనంతుమోహన్(25), బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న మల్లాపురం జిల్లాలోని కలకప్పర గ్రామానికి చెందిన సయ్యద్(39)లు కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరుకు చెందిన గంజాయి సరఫరాదారుడితో వేర్వేరుగా పరిచయం ఏర్పర్చుకున్నారు. వారంతా ముఠాగా ఏర్పడి గంజాయిని రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు.

అరకు ప్రాంతంలో కొనుగోలు

బెంగళూరుకు చెందిన ప్రధాన నిందితుడి సూచన మేరకు ముగ్గురు నిందితులు గంజాయి రవాణాకు బయలుదేరారు. అందులో భాగంగా గంజాయి సరఫరా కోసం వినియోగించాల్సిన కారును తీసుకొని ఈనెల 24న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ సరఫరాదారుల వద్ద కొనుగోలు చేసిన 64కిలోల గంజాయిని కారులో నింపి అక్కడి నుండి తిరిగి స్వస్థలాలకు వెళ్లిపోయారు.

అరకు నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు

కొనుగోలు చేసి రవాణాకు కారులో సిద్ధంగా ఉంచిన గంజాయిని అరకు నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు తరలించాలనేది నిందితుల పన్నాగం. ఆ ప్రకారంగా ముగ్గురు నిందితులు మరోకారులో ఈనెల 26న అరకుకు చేరుకున్నారు. సరుకు ఉన్న కారుకు మరోకారు ఎస్కార్ట్‌గా పెట్టుకొని బయలుదేరారు. తాము వెళ్లే మార్గంలోని పోలీస్‌స్టేషన్లు, చెక్‌పోస్టుల వివరాలను తెలుసుకుంటూ శుక్రవారం రాత్రి హైవేపై పంతంగి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. అప్పటికే విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు మల్కాజిగిరి ఎస్‌వోటీ, చౌటుప్పల్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అందులో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గంజాయిని తరలిస్తున్న కారు చిక్కింది. అదే సమయంలో ఎస్కార్ట్ వాహనాన్ని సైతం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయిని, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన సొత్తు విలువ 32.30లక్షల రూపాయలుగా పోలీసులు అంచనా వేశారు.

యాదాద్రిలో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. శనివారం శ్రీస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల వంటి ప్రాంతాలు సందడిగా కనిపించాయి. స్వామివారిని 40వేల మంది భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి ధర్మదర్శనానికి సుమారు 3గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. వివిధ పూజలతో స్వామివారికి నిత్య ఆదాయం రూ.55,43,899 వచ్చినట్లు అధికారులు తెలిపారు.



ఆలయ సన్నిధిలో భక్తుల రద్దీ

సైదన్నా.. వెళ్లొస్తాం

ముగిసిన జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

- దీపారాధనతో ముగిసిన ఉత్సవాలు
- చివరి రోజు అధిక సంఖ్యలో దర్గాను దర్శించుకున్న భక్తులు

పాలకవీడు: జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ముగిసింది. మూడు రోజుల పాటు సాగిన ఉత్సవాలు శనివారం ముజావర్ జానీ ప్రత్యేక ప్రార్థనల అనంతరం దీపారాధనతో దీపారాధనతో ముగిశాయి. ఉత్సవాలకు చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా సమీపంలోని నాగుల పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సైదన్నా.. వెళ్లొస్తామంటూ భక్తులు తిరుగు పయనమయ్యారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.



దర్గాలో ప్రత్యేక పూజలు చేస్తున్న ముజావర్ జానీ

విధుల్లో కొనసాగిన అధికారులు..

ఉర్సుకు ఊహించిన దానికంటే భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో అధికారులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. నిరంతరం దర్గా పరిసరాల్లో చెత్తాచెదారం తొగించేందుకు ప్రైవేటు కార్మికులను నియమించి పనులు చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలకు అధికాదాయం లభించింది. మూడు డిపోలకు సుమారు రూ.11 లక్షలకు పైగా ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు.

ఆలయాలను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

సూర్యాపేట రూరల్, అర్వపల్లి: అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, తిమ్మాపురంలోని అఖండ జ్యోతిస్వరూప సూర్య నారాయణస్వామి క్షేత్రంతో పాటు సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని శివాలయాలను శనివారం హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోరుపోలియో జడ్జి జస్టిస్ పుల్ల కార్తీక్ సందర్శించారు. ఎరకేశ్వర, నామేశ్వర, త్రికుటేశ్వరాలయాలను దర్శించి పూజలు చేశారు. అర్వపల్లి ఆలయంలో జడ్జిని జెడ్పీటీసీ, న్యాయవాది దావుల వీరప్రసాద్‌యాదవ్ సన్మానించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, ఆర్డీఓ కృష్ణయ్య, డీఎస్పీ నాగభూషణం, సీఐ అశోక్, రూరల్ ఎస్ఐ సాయిరాం పాల్గొన్నారు.



అర్వపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కార్తీక్

వేధింపులతోనే ఆత్మహత్య

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధి మాలిపురం గ్రామానికి చెందిన మేకల చింటు ఆత్మహత్యకు ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులే కారణమని మృతుడి భార్య శిల్ప ఆరోపించింది. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన భర్త ఆత్మహత్యకు గల కారణాలు వివరించింది. మేకల చింటు ఈ నెల 18న ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమలగిరికి చెందిన ముగ్గురు ఫైనాన్స్ వ్యాపారులు రూ.10 వడ్డీకి డబ్బులు ఇచ్చి మానసికంగా, ఆర్థికంగా వేధించారని, ప్రతి రోజు ఫోన్‌లో బెదిరించారని వాపోయింది. డీజే బాక్సులను బలవంతంగా ఇంటి నుంచి తీసుకెళ్లారని తెలిపింది. ఈ ముగ్గురు వ్యాపారుల ఫోన్ నంబర్లను కాల్ డేటా తీసి కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ ముగ్గురిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపూరి సోమన్న, కందుకూరి నాగార్జున, డానియల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకులు ఏపూరి సోమన్న రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు.

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అన్నాడో కవి. స్వయంకృషితో ఆ ఇద్దరు యువకులు ఆదర్శ కృషీవలురుగా మారారు. ఉన్నత చదువులను పక్కన పెట్టి ఒకరు, ఉన్నత ఉద్యోగాన్ని వదులుకొని మరొకరు పొలం బాట పట్టారు. వ్యవసాయ రంగంలో అందివస్తున్న ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకుని మార్కెట్‌లో ధర ఉన్న పంటలను పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం వీరికి అండగా నిలవగా తమతోపాటు పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

-నల్లగొండ డెస్క్

సండే స్పెషల్



తాను సాగుచేస్తున్న చామంతి పూల తోటలో బిచ్చునాయక్

యువసాయం

సాగులో విద్యావంతుల వినూత్న ఒరవడి

- ఉద్యోగం వదిలి ఒకరు.. ఉన్నత చదువులు చదివి మరొకరు
- సరికొత్త ఆలోచనలతో పంటల సాగు
- సొంతంగా మార్కెటింగ్‌తో లాభాల బాట
- అవార్డులు సైతం పొంది ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతులు

పాలీహౌస్‌లో పూల తోట

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని రాజానాయక్ తండాకు చెందిన భూక్య బిచ్చునాయక్ 2012లో బీటెక్ బయోటెక్నాలజీ పూర్తి చేశాడు. 2018 వరకు ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. కానీ, ఫలితం లేకపోవడంతో ఉద్యోగం రాలేదని నిరాశ చెందకుండా వ్యవసాయ రంగం వైపు దృష్టిసారించాడు. సంప్రదాయ పంటలైన పత్తి, మిర్చి, వేరుశనగ, వరిసాగు వైపు కాకుండా వినూత్న ఆలోచన చేశాడు. పాలీహౌస్‌లో పూల సాగు చేసేందుకు నిజామాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో పర్యటించి పంటసాగు, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతుల నుంచి సమాచారం సేకరించాడు. ఉద్యానవన శాఖ అందిస్తున్న రాయితీలను తెలుసుకొని తుంగతుర్తి మండలంలోని వెంపటి గ్రామంలో తనకున్న 12 ఎకరాల్లో.. ఎకరం భూమిలో పాలీహౌస్ ఏర్పాటు చేశాడు. ఈ పాలీహౌస్ ఏర్పాటుకు ప్రభుత్వం 95శాతం సబ్సిడీ ఇచ్చింది. పాలీహౌస్‌లో అలంకరకణ పూలైన లేత గులాబీ, తెలుపు, పసుపు, ఎరుపు రంగు లాంటి చామంతిని సాగు చేస్తున్నాడు. మంచి లాభాలు గడిస్తూ.. మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. గతేడాది జాతీయ ఉత్తమ మిలినీయర్ రైతు–2023 అవార్డును సైతం అందుకున్నాడు.



పాలీహౌస్



జాతీయ ఉత్తమ మిలినీయర్ అవార్డును అందుకుంటున్న బిచ్చునాయక్ (ఫైల్)

ఎకరాకు రూ.6 లక్షల ఆదాయం

బిచ్చునాయక్ తన పాలీహౌస్‌లో నాటేందుకు చామంతి మొక్కలను రూ.2కు ఒకటి చొప్పున మహారాష్ట్రలోని నాసిక్ నుంచి తెప్పించాడు. ఎకరంలో మొత్తం 1,60,000 మొక్కలతో సాగు ప్రారంభించాడు. ప్రస్తుతం ఆయనే మొక్కలు తయారు చేసుకుంటున్నాడు. ఫామ్‌పాండ్ ద్వారా మొక్కలకు నీటిని అందిస్తున్నాడు. ఎకరా సాగుకు మొత్తం ఖర్చు రూ.6,20,000 వస్తుందని.. పూల విక్రయంతో రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వస్తాయని.. దీనిలో పెట్టుబడి పోను ఎకరాకు సుమారు రూ.5 నుంచి 6లక్షల వరకు మిగులుతాయని బిచ్చునాయక్ పేర్కొన్నాడు.

> **యువత వ్యవసాయం వైపు రావాలి**
>
> యువత ఉద్యోగాల కోసం చూడకుండా స్వయం ఉపాధి సాధించేందుకు వ్యవసాయ రంగంవైపు రావాలి. నిరుద్యోగం కారణంగానే 2018లో నేను వ్యవసాయం వైపు వచ్చాను. పాలీహౌస్ ద్వారా పూలమొక్కలు సాగుచేయడానికి ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం బాగుంది. చామంతి పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. చామంతి పూలు ఒకేసారి కోతకు వస్తాయి. దీంతో మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు ఉండవు.
>
> – భూక్య బిచ్చు, రైతు, రాజానాయక్‌తండా

సాఫ్ట్‌వేర్ నుంచి సాగుబడి వైపు



మిరప పంటకు సేంద్రియ ద్రావణం స్ప్రే చేస్తున్న యువరైతు బాలకృష్ణ

నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం ఎర్రచెరువుతండాకు చెందిన రమావత్ బాలకృష్ణది వ్యవసాయ కుటుంబం. బాలకృష్ణ హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, ఎంటెక్ పూర్తి చేశాడు. ఆ తరువాత విప్రో సంస్థలో రేడియో ఫ్రిక్వెన్సీ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరాడు. కరోనా సమయంలో ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేయాల్సి వచ్చింది. అప్పటి నుంచి సాగుపై మక్కువ పెంచుకున్నాడు. సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తున్నాడు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న బాలకృష్ణకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ హరిచందన ఉత్తమ రైతు పురస్కారాన్ని అందజేశారు.

రసాయన ఎరువులతో ప్రారంభించి..

బాలకృష్ణ మొదటగా 2020లో రెండు ఎకరాల్లో మిర్చి, నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. అందరిలాగానే రసాయన ఎరువులు వాడాడు. వచ్చిన పంట మొత్తం పూర్తిగా పెట్టుబడులకే సరిపోయింది. దీంతో సేంద్రియ ఎరువులతో పంటను సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్ ఛానల్స్ చూసి సేంద్రియ సాగుపై అవగాహన పెంచుకున్నాడు. తర్వాత వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలతో సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాడు.

సేంద్రియ పద్ధతిలో పెట్టుబడి తక్కువ..

బాలకృష్ణ సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాడు. సాధారణంగా మిర్చి పంటను రసాయన ఎరువులతో పండిస్తే ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. అందుకు ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాలి. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన మిర్చి పంట ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పెట్టుబడి ఎకరాకు రూ.5వేల నుంచి రూ.10 వేలు మాత్రమే రావడంతో.. ఎకరానికి రూ.3 లక్షల వరకు లాభం పొందుతున్నాడు.



జీవ ఎరువులు తయారు చేస్తున్న బాలకృష్ణ

సొంతంగానే మార్కెటింగ్



బాలకృష్ణ తయారు చేసిన కారం ప్యాకెట్లు

సాధారణంగా మార్కెట్లో కిలో మిర్చి రూ.200 నుంచి రూ.250 వరకు ఉంటుంది. కానీ, సేంద్రియ పద్ధతిలో పండించిన ఈ మిర్చిని బాలకృష్ణ రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నాడు. హైదరాబాద్, ఇతర నగరాల్లో నివసిస్తున్న వారికి తానే కారం పొడి తయారు చేసి కిలో రూ.500కి అమ్ముతున్నాడు.

> **సేంద్రియ వ్యవసాయం చేయాలి**
>
> ప్రస్తుతం మనం తినే ప్రతీది రసాయనాలతోనే ముడిపడి ఉంది. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తి అనారోగ్యం బారిన పడుతున్నాం. రైతులు ఆర్గానిక్ పద్ధతుల్లో పంటలను పండించాలి. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులు వాడితే పెట్టుబడులు కూడా తగ్గుతాయి.
>
> – బాలకృష్ణ, యువరైతు



నలుగురు విద్యార్థులకు అస్వస్థత

- కలుషిత ఆహారమే కారణం

అనంతగిరి(కోదాడ): కలుషిత ఆహారం తిని నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో 57మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. శనివారం 37మంది విద్యార్థులు పాఠశాలకు హాజరై మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులకు అన్నం, వంకాయ కూర, చారు వడ్డించారు. కొద్ది సేపటి తర్వాత నాలుగో తరగతి విద్యార్థి కొత్తపల్లి సాత్విక్ ఇంటికి నడుచుకుంటూ వెళ్తూ మార్గమధ్యలో స్పృహతప్పి పడిపోయాడు. అనంతరం ఐదో తరగతి విద్యార్థి బొడ్డుపల్లి బాలు తీవ్ర కడుపు నొప్పితో బాధపడ్డాడు. విషయం తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా కోలుకున్నారు. వీరితో పాటు మూడో తరగతి విద్యార్థిని విజయ, ఐదో తరగతి విద్యార్థి సంజయ్‌కి వాంతులయ్యాయి. విద్యార్థుల అస్వస్థతకు కలుషిత ఆహారమే కారణమని వైద్యాధికారి రంజిత్ తెలిపారు. విద్యార్థుల అస్వస్థత విషయం తెనుకున్న తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ సలీం షరీఫ్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.పాఠశాలల పురుగులు పట్టిన బియ్యాన్ని మార్చాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఫోన్‌లో ఆదేశించారు.



విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ, తహసీల్దార్

పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం అనంతగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహారానికి బదులు కలుషిత ఆహారం పెట్టి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంఈఓ సలీం షరీఫ్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో కనీసం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాత్‌రూంలు కూడా సరిగా లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిరోజు వండిన ఆహారాన్ని ముందుగా ఓ ఉపాధ్యాయుడు తినాలని, ఆతర్వాతే విద్యార్థులకు వడ్డించాలని ఎంఈఓ ఆదేశించారు. అదే విధంగా పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.